సాక్షి
విశాఖపట్నం
శనివారం । 27 । ఏప్రిల్ । 2024



నేడు పాలిసెట్
జిల్లాలో పాలిసెట్‌ను పటిష్టంగా నిర్వహిస్తున్నట్టు సమన్వయాధికారి డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. 8లో



విజ్ఞాన ప్రపంచంలో ఏయూకు అత్యున్నత స్థానం 8లో



పరిపాలన రాజధానితో విశాఖ అగ్రపథం 8లో

న్యూస్‌రీల్

దార్శనికుడు 'కట్టమంచి'



కట్టమంచి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బొత్స ఝాన్సీ

బీచ్‌రోడ్డు: విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, సామాజిక దార్శనికుడు కట్టమంచి రామలింగారెడ్డి అని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. సంప్రదాయ, ఆధునిక విద్యా విధానానికి ఆయన వారధిలా నిలిచారన్నారు. ఏయూ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సిరిపురంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో కట్టమంచి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన ఆయన ఏయూ వ్యవస్థాపక ఉపకులపతిగా, వర్సిటీ అభివృద్ధికి చేసిన కృషి నిరుపమానమన్నారు. వర్సిటీలో ఆయన వేసిన విద్యా విత్తనం నేటు వటవృక్షంలా మారి, కోట్ల మందికి విద్యా గంధం పంచుతోందన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



కృష్ణా కాలేజీలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అధికారులతో సమీక్షిస్తున్న జేసీపీ ఫకీరప్ప

అల్లిపురం : నగరంలో పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప శుక్రవారం సందర్శించారు. ఎంవీపీ స్టేషన్ పరిధిలోని డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీతో పాటు ఇతర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఏర్పాట్లపై సంతృప్తి
అల్లిపురం: ఏయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పార్లమెంట్ సాధారణ పరిశీలకుడు అమిత్ శర్మ, పోలీసు పరిశీలకుడు అమిత్ కుమార్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తూర్పు, ఉత్తర, దక్షిణ, భీమిలి, గాజువాక నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

ప్రచార బోర్డుల అనుమతికి జీవీఎంసీలో ప్రత్యేక డెస్క్



డాబాగార్డెన్స్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొత్తగా ప్రచార బోర్డుల అనుమతికి అభ్యర్థులు, రాజకీయ పార్టీల సౌలభ్యం కోసం దరఖాస్తులు స్వీకరించేందుకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పోర్టికో వద్ద ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేశామని కమిషనర్ సాయికాంత్ వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ పరిధిలో అభ్యంతరం లేని, వివాదాలు లేని, కోర్టు పరిధిలో లేని ఇతర ప్రదేశాల్లో ఎన్నికల ప్రచార బోర్డులు ఏర్పాటు చేసుకునేందుకు ఇప్పటి వరకు సంబంధిత అసెంబ్లీ/లోక్‌సభ నియోజకవర్గ రిటరినింగ్ ఆఫీసర్ ద్వారా అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. కొత్తగా దరఖాస్తుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డెస్క్ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తుందని, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 73960 45405 నంబర్‌లో సంప్రదించాలని జీవీఎంసీ కమిషనర్ కోరారు.

శ్రీభరత్ శ్రీరంగనీతులు

- **చేసేవి అక్రమాలు..** చెప్పేవి నీతికబుర్లు
- **భూ ఆక్రమణల పు**నాదులపై ఎదిగిన గీతం
- **రూ.500 కోట్ల ప్ర**భుత్వ భూమి ఆక్రమణ
- **విద్యాదానం కోస**మే గీతం స్థాపించామంటూ ప్రగల్భాలు
- **టీడీపీ నేతల పిల్లలకు సైతం రూపాయి తగ్గించనంటున్న భరత్**

చెప్పేవి శ్రీరంగనీతులు.. **చేసేవి అడ్డ**గోలు పనులు.. ఈ నా**నుడి విశాఖ** టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.**శ్రీభరత్‌కు** అచ్చుగుద్దినట్లు సరిపో**తుంది. నేను నీతి** మంతుడిని అని బయ**టకు కలరింగ్** ఇచ్చే ఈ విద్యావంతు**డు.. అక్రమాలు,** ఆక్రమణలకు వారసుడి**గా, మాజీ ఎంపీ,** శ్రీభరత్ తాత అయిన **ఎంవీవీఎస్ మూర్తి** మరణం తర్వాత 2018**లో రాజకీయా**ల్లోకి వచ్చారు. నీతి క**బుర్లు చెబుతూ** విశాఖలో విద్యాలయం **పేరుతో** ప్రభుత్వ భూములను అ**మాంతం తన** గుప్పిట్లో పెట్టుకునేందుకు **మరోసారి** ఎన్నికల బరిలో దిగారు. **విద్యా దానం** కోసమే గీతం అంటూ **వేదాలు వల్లించే** భరత్.. ఫీజులో రూపాయి **తగ్గినా ఊరు**కోదని ఆరో**పణలు ఉన్నాయి. పైగా** తనకు రాజకీయాలకంటే **వ్యాపారాలే** ముఖ్యమన్న ధోరణిలో ఉన్నారు. ఎవరైనా తన రాజకీయ ప్రస్థానం గురించి ఏం చెబుతారు? తాను పూర్తి స్థాయి రాజకీయాల్లో ఉంటానని, రాజకీయాల్లో రాణిస్తానని చెప్పుకుంటారు. శ్రీభరత్ మాత్రం తాను ఫుల్ టైం పొలిటిషియన్‌ను కాదంటున్నారు.

– సాక్షి, విశాఖపట్నం



ఇటీవల గాజువాకలో జరిగిన చంద్రబాబు సభలో శ్రీ భరత్ మాట్లాడుతూ అక్రమంగా గీతం యూనివర్సిటీ భవనాలను కూల్చేశారు.. ఇది చాలా తప్పు అంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు.

కానీ.. కొన్ని చానల్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పిన సుద్దపూస మాటలివీ..

'మేం అక్కడ యూనివర్సిటీ పెట్టినప్పుడు రాళ్లు రప్పలు ఏమీ లేవు. కొలతలు కూడా సైంటిఫిక్‌గా లేవు. ఎప్పుడైనా.. పొరపాటున సరిహద్దులు అటు ఇటు అయ్యుంటాయేమో..' అంటూ ఆక్రమణలను కప్పిపుచ్చేలా మాట్లాడారు.

పొరపాటున హద్దులు మారితే.. గజం, రెండు గజాలు మహా అయితే ఓ సెంటు భూమి అటు ఇటుగా మారుతుంది. కానీ 40 ఎకరాలకు పైగా భూమి సరిహద్దులు మారిపోతాయా అంటూ భరత్‌ను విశాఖ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమంగా రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే.. ప్రభుత్వం ఎందుకు ఊరుకుంటుంది. పైగా ఇది ప్రభుత్వమే అక్రమంగా కొట్టేసిందని ఎలా అంటావయ్యా అని ఎదురు ప్రశ్నిసున్నారు.

* * *

మరో సందర్భంలో భరత్ మాట్లాడుతూ గీతం వ్యవహారమంతా నాకెలా తెలుస్తుంది? నేను ఆ వ్యవహారం తర్వాత ప్రెసిడెంట్ అయ్యాను. ముందు జరిగిన వాటికి నాకు సంబంధం ఏమిటి? అని ఎదురు ప్రశ్నించారు.

ఓ విద్యావేత్తగా.. నీతికబుర్లు వల్లించే రాజకీయ నాయకుడిగా.. తప్పు జరిగినప్పుడు సరిదిద్దాల్సిన బాధ్యత నీకు లేదా భరత్ అంటూ విశాఖ జనం అడుగుతున్నారు. నీవు బాధ్యతలు తీసుకోవడానికి ముందే ఆక్రమణలు జరిగినట్లు తెలిసింది కదా! నీవు నిజాయతీ పరుడివైతే ఆ భూములు పొరపాటున మా కాంపౌండ్‌లో ఉండిపోయాయి. వీటిని పేదలకు లేదా ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోండి అని ఎందుకు ఆ 40 ఎకరాల భూమిని తిరిగి అప్పగించలేదు? ఇదేనా నీ నీతి, నిజాయితీ? అని ప్రజలంతా ప్రశ్నిస్తున్నారు.

* * *

మరో విడ్డూరమేంటంటే.?

ఈ సారి ఎంపీగా విజయం సాధించాక.. విశాఖలో ప్రభుత్వ భూములను పరిరక్షిస్తా.. అని ప్రచారంలో శ్రీభరత్ ఊదరగొడుతున్నారు.

ఈ విషయం విని.. నగర ప్రజలు నవ్వుతున్నారు. ఎవరయ్యా 'నువ్వు ఇంత టాలెంటెడ్‌గా ఉన్నావ్..' అని ఎద్దేవా చేస్తున్నారు. ఏకంగా రూ.500 కోట్ల ప్రభుత్వ భూమిని గుప్పిట్లో పెట్టుకున్నావ్. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఆ భూములను గీతం పేరుకి బదలాయింపు చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశావు.. ఇందుకోసం చంద్రబాబు ప్రభుత్వ క్యాబినెట్‌లో డిస్కషన్ చేయలేదా? ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు కోర్సులున్న శ్రీలంక యూనివర్సిటీ 25 ఎకరాల్లోనే ఉంది. కానీ గీతం యూనివర్సిటీకి వందల ఎకరాలు కావాలా? అని అప్పటి చంద్రబాబు క్యాబినెట్‌లో మంత్రి ఓ సందర్భంలో వ్యాఖ్యలు చేయలేదా? దేశంలోనే అత్యంత ఖరీదైన విద్యా సంస్థల్లో ఒకటైన గీతం వర్సిటీ తొలుత పాతిక ఎకరాల్లో ఏర్పాటై.. క్రమక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటూ 110 ఎకరాల విస్తీర్ణంలో డీమ్డ్ వర్సిటీ స్థాయికి ఎలా చేరింది. ప్రభుత్వ భూములను కబ్జా చేయడం.. ఆనక ఎలియనేషన్ చేయించుకుని వాటిని సొంతం చేసుకోవడం అప్పట్లో మీ తాత మూర్తికే చెల్లింది. ఇది వాస్తవం కాదా అని ప్రజలు గుర్తు చేస్తున్నారు. వీటన్నంటికి సమాధానం చెప్పు భరత్ అని అడుగుతున్నారు. రేప్పొద్దున్న ఎంపీగా గెలిస్తే ఆ 40 ఎకరాలతో పాటు పక్కనున్న భూములను భక్షిస్తారే తప్ప.. సంరక్షించే ఆలోచన ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

* * *

'నాకు డబ్బు పిచ్చి లేదు..' అని బీరాలు పలుకుతున్న భరత్‌ని చూసి విశాఖ వాసులు ఇదెక్కడి మాస్ డైలాగ్ అని అంటున్నారు.

'నేను హెల్ప్ లెస్.. మా టీడీపీ వాళ్లకే ఫీజు తగ్గించను. ఇది గీతం పాలసీ. పేదవాళ్లు ఫ్రీగా చదవలేకపోతున్నారంటే అది మా తప్పు కాదు. ఈ భూములు ప్రభుత్వం దగ్గర నుంచి తీసుకున్నాం కాబట్టే.. తక్కువ ఫీజులు అని అడుగుతున్నారు. ఈ బాధలు ఉండొద్దనే హైదరాబాద్, బెంగళూరులో ప్రైవేట్ భూములు కొనుగోలు చేసుకున్నాం. అక్కడ ఫీజు తగ్గించమని అడిగే అవకాశం ఎవ్వరికీ ఇవ్వలేదు. క్వాలిటీ తగ్గించలేను. అందరికీ కొండమీది కోతి కావాలంటే కుదురుతుందా..? మేం క్వాలిటీ ఎడ్యుకేషన్, అన్ని సదుపాయాలు ఇస్తున్నప్పుడు ఎలా తక్కువ ఫీజులు వసూలు చేస్తాం. నేనంత హెల్ప్ చేయలేను. లిమిట్‌గా హెల్ప్ చేస్తాను. మా టీడీపీ కార్యకర్తలు, నాయకులకు కూడా అదే చెప్తాను. ఫీజు కట్టడానికి టైమ్ కావాలంటే ఇస్తాను తప్ప.. ఫీజు తగ్గించే ప్రసక్తే లేదు.' అని భరత్ తెగేసి చెబుతారని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తుచేస్తున్నారు. అన్ని వర్గాలకూ నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకొస్తామంటూ ప్రభుత్వం దగ్గర నుంచి భూములు లాక్కొన్న భరత్ కుటుంబం.. ఇప్పుడిలా ప్లేటు ఫిరాయించే మాటలు వింటుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందనే సామెత గుర్తుకొస్తోందని ప్రజలు అంటున్నారు.

నేను ఫుల్ టైం పొలిటిషియన్‌ను కాదు!

కొన్నాళ్ల క్రితం శ్రీభరత్ ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజకీయాలపై తన మనసులో మాటను వెల్లడించారు. 'నేను ఫుల్ **టైం పొలిటిషియన్‌ను** కాదు.. పార్ట్ టైం పొలి**టిషియన్‌ను' అని** చెప్పారు. పార్ట్ టైం పొలి**టిషియన్‌ను ప్రజలు** ఎలా ఆదరిస్తారు? ఇలా **వచ్చి అలా వెళ్తానంటే** ఎలా విశ్వసిస్తారు? అని **ఆ జర్నలిస్టు ప్రశ్నిం**చారు. దీనికి ఆయన.. **'రాజకీయాల్లో రాణి**స్తానని నేను ఎప్పుడు **చెప్పాను?' అంటూ** ఎదురు ప్రశ్న వేశారు. **తాను చేసేది చిన్న** వ్యాపారం కాదు.. పెద్ద **వ్యాపారం అని స్పష్టం** చేశారు. తనపై సాను**కూలత ఉన్న వారే** తన వెంట ఉంటారని **చెప్పారు. అంతేకాదు**.. టీడీపీతో పాటు అన్ని **పార్టీల్లోనూ స్వార్థం** పెరిగిపోయిందని వ్యాఖ్యా**నించారు. శ్రీభరత్ వ్యా**ఖ్యలు ఇప్పుడు సోషల్ **మీడియాలో వైరల్** అవుతున్నాయి. టీడీపీ**లోనూ తీవ్ర దుమా**రాన్ని రేపుతున్నాయి. తాను ఫుల్ టైం పొలిటిషియన్ కాదని చెబుతున్న ఆయన విశాఖ ఎంపీగా పోటీ చేయడం ఎందుకని, ప్రజలకు సేవలందించడంపై ఏం సమాధానం చెబుతారని టీడీపీ శ్రేణులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలోను, సమావేశాల్లోనూ ఆయన ఇదే తీరుతో ఉన్నారని చెబుతున్నారు.



గతంలో మూర్తి వ్యాఖ్యలపై కథనం

చివరిగా.. ఎందరో మహానుభావులను అందించి దేశంలోనే అతి గొప్ప విశ్వవిద్యాలయంగా పేరొందిన ఆంధ్రా యూనివర్సిటీని భరత్ తాత మూర్తి దెయ్యాల కొంప అని వ్యాఖ్యలు చేసి తీవ్ర దుమారం రేపారు. అప్పుడు కనీసం ఆ వ్యాఖ్యలు తప్పు తాత.. మనకూ ఓ విద్యాలయం ఉంది. ఇలాంటి మాటలు మాట్లాడకూడదు.. క్షమాపణలు చెప్పేద్దామని కనీసం అనలేదు. ఇప్పుడు విశాఖను ఉద్ధరిస్తానంటే ఎలా నమ్ముతాం భరతూ.. అంటూ ప్రజలు గతాన్ని గుర్తు చేస్తున్నారు.

33 నామినేషన్లకు ఆమోదం

- విశాఖ ఎంపీ స్థానానికి మొత్తం 39 నామినేషన్లు
- ఆరు తిరస్కరణ



నామినేషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, పరిశీలకులు అమిత్ శర్మ, అమిత్ కుమార్

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖ పార్లమెంట్ స్థానానికి దాఖలైన మొత్తం 39 నామినేషన్లలో 33 పత్రాలకు ఆర్వో, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆమోదం తెలిపారు. ఆరు నామినేషన్ పత్రాలను నిబంధనలను అనుసరించి తిరస్కరించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు అమిత్ శర్మ, పోలీస్ పరిశీలకుడు అమిత్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం ఆర్వో నామినేషన్ల పరిశీలన ప్రక్రియను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ ప్రక్రియలో ఒక్కో నామినేషన పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకున్నారు. అఫిడవిట్ పత్రంలో సంతకం చేయని కారణంగా స్వతంత్ర అభ్యర్థి మెహబూబ్ సుభాన్ నామినేషన్ తిరస్కరిస్తున్నట్లు ఆర్వో ప్రకటించారు. ఫార్మాట్ ప్రకారం దరఖాస్తు సమర్పించలేనందున స్వతంత్ర అభ్యర్థి వియ్యపు గంగరాజు, జై భీంరావు భారత్ అభ్యర్థిని నక్క నమ్మిగ్రేస్ నామినేషన్లను తిరస్కరించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ ప్రధాన అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా వేసిన బొత్స అనూష, మతుకుమిల్లి తేజస్విని నామినేషన్లను తిరస్కరిస్తున్నట్లు ఆర్వో వివరించారు. బ్లూ ఇండియా పార్టీ తరపున మురాల అరుణశ్రీ, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి దేవర శంకర్ వేసిన నామినేషన్లలో ఫారం–ఎ, ఫారం–బి పత్రాలు సరిగ్గా లేని కారణంగా ప్రపోజల్స్ సంతకాలను పరిగణలోకి తీసుకున్నారు. వారిని స్వతంత్ర అభ్యర్థులుగా గుర్తించి ఆమోదం తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన పట్టపగలు రాజా రమేష్ పత్రాల్లో ప్రపోజల్స్ సంతకాలన్నీ ఒకేలా ఉండటంతో ఆర్వో తిరస్కరించారు.

27 నామినేషన్ల తిరస్కరణ

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 147 నామినేషన్ దాఖలు అయ్యాయి. వీటిలో 27 వివిధ కారణాలతో తిరస్కరించారు. 120 మంది నామినేషన్లు ఆమోదించారు.

నియోజకవర్గం	ఆమోదించినవి	తిరస్కరించినవి
విశాఖ దక్షిణ	19	1
విశాఖ తూర్పు	15	8
విశాఖ ఉత్తర	17	7
విశాఖ పశ్చిమ	17	2
భీమిలి	17	3
గాజువాక	16	5
పెందుర్తి	19	1

యథేచ్ఛగా గంటా కోడ్ ఉల్లంఘన

- ఉప్పాడలో రోడ్లపైన బాణసంచా కాల్చివేత
- మంగమారిపేటలో రోడ్డు మూసేసి టెంట్ వేసి ప్రచారం
- ఎర్రిమాంబ ఆలయంలో కండువాతో పూజలు
- ప్రయాణికులు, వాహనచోదకులు, స్థానికుల అసహనం



మంగమారిపేట వద్ద రోడ్డుపైనే వేసిన టెంట్

కొమ్మాది : భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారు. రోడ్లను ఓ వైపు మూసివేయడం, రోడ్లపైన బాణసంచా కాల్చడం, పార్టీ జెండాలు, కండువాలతో గుడిలోకి వెళ్లడం వంటివి చేశారు. వీరి వల్ల బీచ్‌రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రయాణికులు, వాహనచోదకులు ఎండలో తీవ్రఅవస్థలు పడ్డారు. జీవీఎంసీ 4వ వార్డులో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం పార్టీ శ్రేణులతో ఆయన ఉప్పాడ చేరుకోగా.. టీడీపీ నాయకులు భీమిలి బీచ్‌రోడ్డు ప్రధాన రహదారిపై బాణసంచా కాల్చారు. ఈ క్రమంలో 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో మండుటెండలోనే ప్రయాణికులు అగచాట్లు పడ్డారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇక మంగమారిపేటలో ఏకంగా రోడ్డును ఓ వైపు మూసి వేశారు. రోడ్డుపైనే టెంట్ వేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రోడ్డుకిరువైపులా జెండాలను కట్టేశారు. దీంతో రామాద్రి నుంచి మంగమారిపేట వరకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా రోడ్డుపైనే టెంట్ వేసి ఎన్నికల ప్రచారాలు, సమావేశాలు నిర్వహించడమేమిటంటూ పలువురు అసహనం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఓ వైపు దారిని మూసివేయడంతో పాటు మరో వైపు దారిలో టీడీపీ కార్యకర్తల వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేసి ప్రయాణికుల సహనాన్ని పరీక్షించారు.

ఆ చేదు అనుభవాలను మర్చిపోగలమా గంటా?

మంగమారిపేటలో గంటా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిస్తే తీర ప్రాంతాలకు ఆనుకుని లేదా దీనికి సమీపంలో మత్స్యకారులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. గంటా హామీపై ఇక్కడి మత్స్యకారులు రుసరుసలాడుతున్నారు. గతంలో గంటా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంగమారిపేటలో 135 ఇళ్లు, తిమ్మాపురంలో 75 ఇళ్లు కూల్చి వేశారని మత్స్యకారులు గుర్తు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయన చేసిన గాయంతో సుమారు 210 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇప్పటికీ ఆ చేదు అనుభవాలను ఇక్కడి మత్స్యకారులు మర్చిపోలేకపోతున్నారు. నాడు ఇళ్లు కూల్చిన ఆయన.. నేడు స్థలం ఇస్తానంటే ఎలా నమ్మాలని ఇక్కడి మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. మత్స్యకారులకు ఓటు అడిగే హక్కు గంటా శ్రీనివాసరావుకు లేదని.. ఈ ఎన్నికల్లో ఆయనకు ఓటుతో బుద్ధి చెబుతామంటూ మత్స్యకార మహిళలు స్పష్టం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి 4వ వార్డులో నిర్వహించిన ప్రచారం అనంతరం టీడీపీ నాయకులు కాపులుప్పాడలో వృద్ధులకు డబ్బులు పంపిణీ చేశారు. కాగా.. 14 గ్రామాల ఆరాధ్య దేవత శ్రీ ఎర్రిమాంబ ఆలయంలోకి గంటా శ్రీనివాసరావు, నేతలు పార్టీ కండువాతో వెళ్లడంపై పలువురు మత్స్యకారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ఎర్రిమాంబ గుడిలో పార్టీ కండువాతో గంటా



కాపులుప్పాడలో వృద్ధులకు డబ్బులు పంపిణీ చేస్తున్న నాయకులు

విశాఖ నుంచి మలేసియాకు కొత్త విమాన సర్వీసు



కౌలాలంపూర్ నూతన సర్వీసును ప్రారంభిస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయం నుంచి మరో అంతర్జాతీయ విమాన సర్వీసు శుక్రవారం ప్రారంభమైంది. ఎయిర్ ఆసియా విమానయాన సంస్థ విశాఖ నుంచి కౌలాలంపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసును ప్రారంభించింది. ఈ విమాన సర్వీసును ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి ప్రారంభించారు. ఈ విమానం కౌలాలంపూర్ నుంచి విశాఖకు రాత్రి 9.30 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 10 గంటలకు బయలుదేరి, తెల్లవారి 4.20 గంటలకు కౌలాలంపూర్ వెళ్తుంది. ఈ సర్వీసు బుధవారం, శుక్రవారం, ఆదివారం ఉంటుంది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ విశాఖ విమానాశ్రయం నుంచి నడుస్తున్న అంతర్జాతీయ సర్వీసుల్లో ఇది మూడవదన్నారు. స్కూట్ ఎయిర్‌లైన్స్ ద్వారా సింగపూర్‌కు సోమ, బుధ, శుక్ర, శనివారాల్లో సర్వీసులు అందుబాటులో ఉన్నాయన్నారు. థాయ్ ఎయిర్ ఆసియా విమానయాన సంస్థ మంగళ, గురు, శనివారాల్లో బ్యాంకాక్‌కు సర్వీసులు నడుపుతోందన్నారు. ఇక విశాఖ విమానాశ్రయంలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. గతేడాది కంటే 11.80 శాతం వృద్ధిని సాధించినట్లు చెప్పారు. 2023–24లో 27,22,542 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారన్నారు. ఇది ఆల్‌టైమ్ రికార్డని పేర్కొన్నారు. రన్‌వే సర్ఫేసింగ్ పనులు చేయడం వల్ల 135 రోజుల పాటు రాత్రి పూట కార్యకలాపాలు లేక విమాన సర్వీసులు తగ్గినప్పటికీ.. ఈ వృద్ధిని సాధించినట్లు సంతోషం వ్యక్తం చేశారు. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సౌకర్యాలు మెరుగుపరుస్తూనే ఉన్నట్లు వెల్లడించారు. విశాఖ నుంచి దుబాయ్, గల్ఫ్ దేశాలకు భారీ ఎయిర్ ట్రాఫిక్ ఉందన్నారు. ముంబయికి విమాన సర్వీసులు పెంచాల్సి ఉందని, సూరత్, వారణాసి, కోయంబత్తూర్ తదితర ప్రాంతాలకు డిమాండ్ ఉందన్నారు. ఇక్కడ నుంచి తెల్లవారుజామున కార్యకలాపాలు ప్రారంభించడానికి విమానయాన సంస్థలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కస్టమ్స్ కమిషనర్ రవిశంకర్, ఎయిర్ ఆసియా స్టేషన్ మేనేజర్ అమర్ దీప్ సౌని, ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ ప్రతినిధులు కుమార్ రాజా, ఒ.నరేష్ కుమార్, విజయ్ మోహన్, డీఎస్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలు మారిన వారికే పదవులా?

- 40 ఏళ్లుగా ఊడిగం చేస్తున్న మమ్మల్ని విస్మరిస్తారా..
- సొంత సామాజికవర్గం వారికే పదవులన్నీ కట్టబెడతారా.!
- పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జిగా బాబ్జీని నియమించడంపై కార్పొరేటర్ పీలా ఫైర్
- బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సమక్షంలో నిలదీసిన శ్రీనివాస్

పెందుర్తి: పెందుర్తి టీడీపీలో మంటలు చల్లారడం లేదు. పదవుల పందేరంలో నాకు అన్యాయం జరిగిందంటే.. నాకు జరిగిందని ఆ పార్టీ సీనియర్ నాయకులు అక్కసు వెల్లగక్కుతూనే ఉన్నారు. మొన్నటి వరకు తనకు పెందుర్తి టికెట్ ఇవ్వలేదని అలకబూని అధినేత చంద్రబాబును నానా మాటలు అన్న బండారు సత్యనారాయణమూర్తికి మాడుగుల టికెట్ కేటాయించడంతో చిరకాల రాజకీయ శత్రువు అయిన పంచకర్ల రమేష్‌బాబుకు దాసోహం అయిపోయారు.

గండి వర్సెస్ పీలా

అయితే తాజాగా గండి బాబ్జీ, పీలా శ్రీనివాసరావు ల మధ్య వివాదం రాజుకుంది. పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జిగా గండి బాబ్జీని అధినేత చంద్రబాబు ప్రకటించడంతో దీర్ఘకాలంగా పార్టీకి నమ్మినబంటుగా ఉన్న కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. చంద్రబాబు దూత, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఎదుటే గండి బాబ్జీ నియామకాన్ని పీలా శ్రీనివాసరావు వ్యతిరేకించారు. గురువారం రాత్రి అనకాపల్లిలోని సీఎం రమేష్ క్యాంప్ కార్యాలయంలోనే పీలా శ్రీనివాసరావు బహిరంగానే తన అక్కసు వెల్లగక్కారు. ఎన్నో దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని ఉన్న తమకు కాదని పార్టీలు మారి వచ్చిన గండి బాబ్జీని పెందుర్తి ఇన్‌చార్జిగా ఎలా నియమిస్తారని నిలదీశారు. సామాజికవర్గ సానుభూతితోనే గండి బాబ్జీని సిఫార్సు చేశారని సీఎం రమేష్ తీరుపై పీలా పరోక్షంగా విమర్శలకు దిగారు. అనకాపల్లిలో తన సోదరుడు పీలా గోవింద సత్యనారాయణకు, పెందుర్తిలో తనకు ఎంతో పరాభావం జరిగిందని ఆక్రోశం వెల్లగక్కారు. అయితే పీలా శ్రీనివాస్ మరింతగా ఊగిపోతున్న సమయంలో సీఎం రమేష్‌తో పాటు టీడీపీ సీనియర్ నాయకులు కలగజేసుకుని సముదాయించారు. దీంతో పీలా శ్రీనివాస్ నెమ్మదించి సమావేశం నుంచి వెనుదిరిగినట్లు విశ్వసనీయ సమాచారం.

బాలికపై లైంగికదాడి

యువకుడిపై కేసు నమోదు

అగనంపూడి: ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని దువ్వాడ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వివరాలివీ.. నిర్వాసిత కాలనీకి చెందిన బాలిక(16) నగరంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే కాలనీకి చెందిన యువకుడు ప్రేమిస్తున్నానంటూ కొద్ది కాలంగా ఆమెతో చనువుగా ఉంటున్నాడు. మాయమాటలు చెప్పి ఆమెను శారీరకంగా లోబర్చుకున్నాడు. ఈ నెల 23న బాలిక అనారోగ్యానికి గురవ్వడంతో ఆమె తల్లి గాజువాకలోని ఆస్పత్రికి తీసుకువెళ్లింది. వైద్య పరీక్షలు నిర్వహించగా బాలిక గర్భవతి అని తేలింది. ఆమెకు అబార్షన్ చేయించేందుకు కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా.. అక్కడి వైద్యులు వారిని ప్రశ్నించి దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద యువకుడిపై కేసు నమోదు చేశారు.

ప్రచార పర్వం


జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో ఓ మహిళకు మజ్జిగ అందిస్తున్న వైఎస్సార్ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్


ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న వైఎస్సార్ సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు


ప్రియదర్శిని కాలనీలో వృద్ధుడి బాగోగులు తెలుసుకుని.. ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కేకేరాజు


ప్రచార కార్యక్రమంలో చిన్నారిని ఎత్తుకుని ముద్దాడుతున్న వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్


మసీదు వీధిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బొత్స ఝాన్సీ, వాసుపల్లి గణేష్ కుమార్

యువకుడిపై పోక్సో కేసు నమోదు

అక్కిరెడ్డిపాలెం: ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. గొంతిన వానిపాలెంకు చెందిన యువతి డిగ్రీ చదువుతోంది. అదే వీధికి చెందిన సిద్ధూ వినాయక డిప్లమా చేశాడు. వీరిద్దరి మధ్య రెండేళ్లుగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. వినాయక ఈ మధ్య యువతికి తరచూ ఫోన్లు చేస్తూ వేధిస్తున్నాడు. దీంతో ఆమె తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పింది. అయినా యువతి కళాశాలకు వెళ్లి వేధిస్తున్నాడు. దీంతో ఆమె 24న పోలీసులకు ఫిర్యాదు చేసింది. గాజువాక సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాజువాక ఎస్‌ఐ ఎండీ నజీర్ పోక్సో కేసుగా నమోదు దర్యాప్తు చేస్తున్నారు.



విజ్ఞాన ప్రపంచంలో ఏయూకు అత్యున్నత స్థానం

వ్యవస్థాపక దినోత్సవంలో వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విజ్ఞాన ప్రపంచంలో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ప్రత్యేక స్థానం ఉందని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ 99వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పరిపాలనా భవనం వద్దనున్న వ్యవస్థాపక వీసీ కట్టమంచి రామలింగారెడ్డి, మెయిన్ గేట్ వద్ద నున్న ఏయూ చిహ్నానికి పూలమాలలు వేశారు. అనంతరం సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ యువతను నిరంతరం ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యతను వర్సిటీ సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీ ఆచార్య బీల సత్యనారాయణ, మాజీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమార్‌రాజ, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, ఆచార్యులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కట్టమంచి విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, మాజీ వీసీలు బీల సత్యనారాయణ, వి.బాలమోహన్‌దాస్, జీఎస్ఎన్ రాజు

ప్రయాణికుల కోసం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సాందీప్ ఓ ప్రకటనలో తెలిపారు.

- తిరుపతి – శ్రీకాకుళం రోడ్ (07440) స్పెషల్ ప్రతీ ఆదివారం తిరుపతిలో రాత్రి 8.05 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.10 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. ఈ రైలు మే 5, 12న నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్ – తిరుపతి (07441) స్పెషల్ ప్రతీ సోమవారం శ్రీకాకుళం రోడ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.38 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 6.40 గంటలకు బయల్దేరి మరసటి రోజు ఉదయం 8.20 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు మే 6, 13వ తేదీల్లో నడుస్తుంది.
- కొచ్చువేలి – బరౌని (06091) సమ్మర్ స్పెషల్ ప్రతీ శనివారం కొచ్చువేలిలో తెల్లవారుజామున 1.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 10.50 గంటలకు బయల్దేరి సోమవారం మధ్యాహ్నం 1.55 గంటలకు బరౌని చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 29 వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో బరౌని – కొచ్చువేలి (06092) సమ్మర్ స్పెషల్ ప్రతీ మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు బరౌనిలో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 4.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 4.20 గంటలకు బయల్దేరి గురువారం ఉదయం 9.55 గంటలకు కొచ్చువేలి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూలై 2 వరకు నడుస్తాయి.

తిరువనంతపురం – సిల్చార్ ఎక్స్‌ప్రెస్ రద్దు

ఈ నెల 30న తిరువనంతపురంలో బయల్దేరాల్సిన తిరువనంతపురం – సిల్చార్ (12507) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. నార్త్ ఈస్ట్ ఫ్రంటియర్ రైల్వే పరిధిలో గూడ్స్ రైలు ఇంజిన్ పట్టాలు తప్పడంతో ఈ రైలు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పిల్లల ఉన్నతిని చూడలేకపోయాం..

- ఎబీవర్స్‌డేకు అనుమతి నిరాకరణపై తల్లిదండ్రుల అసంతృప్తి
- మంచి అవకాశం కోల్పోయామంటూ విద్యార్థుల ఆవేదన

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించతలపెట్టిన ఎబీవర్స్‌డేకు అనుమతి నిరాకరణపై తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ పిల్లల జీవితంలో ఒక అపురూపమైన ఘట్టాన్ని చూడలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

శుక్రవారం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు తల్లిదండ్రులు ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయానికి వచ్చి అధికారులతో మాట్లాడారు. విద్యకు సంబంధించిన కార్యక్రమంపై పలు పత్రికల్లో వచ్చిన అసత్య కథనాలను సాకుగా చూపుతూ అనుమతి రద్దు చేయడం సమంజసం కాదని వారు అభిప్రాయపడ్డారు. పలువురు విద్యార్థులు సైతం అసంతృప్తి, అసహనం వ్యక్తం చేశారు.

కుటుంబంతో వచ్చాం..



వర్సిటీలో జరిగే కార్యక్రమంలో పాల్గొనడానికి మా కుటుంబంతో కలిసి వచ్చాం. అధికారులు ఎంతో కష్టపడి విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చేలా కృషి చేశారు. వారికి పరీక్షలు అయిపోతున్నాయి, ఉద్యోగాలలో చేరిపోతారు. మళ్లీ ఎబీవర్స్‌డే నిర్వహించడం సాధ్యమయ్యే విషయం కాదు.

– పి.రత్నకుమార్‌స్వామి, పాయకరావుపేట

ఎబీవర్స్‌డే రద్దు బాధేసింది..



గతంలో ఎప్పుడూ తల్లిదండ్రులకు సన్మానం చేసే కార్యక్రమం, అవకాశం రాలేదు. ఎబీవర్స్‌డేలో నా తల్లిదండ్రులను సత్కరించాలని అనుకున్నాను. మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు ముందు ఎంతో సంతోషంగా ఫీల్ అయ్యాను. చివరి నిమిషంలో అనుమతి నిరాకరించారని తెలిసి బాధేసింది. అధికారులు పూర్తిగా పరిశీలించి నిర్ణయం తీసుకుని ఉండాల్సింది.

– పి.ఆర్.ఎస్.వరప్రసాద్, స్టాటస్టిక్స్ విభాగం విద్యార్థి

కన్నీటితో వెనుతిరిగారు..



తమ పిల్లల భవిష్యత్తును కళ్లారా చూడాలని ఆశతో ఎంతో దూర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు వచ్చారు. ఎబీవర్స్‌డేకు అనుమతి రద్దు చేశారని తెలిసి కన్నీటితో వెనుతిరిగారు. పక్కనే ఉన్న గీతం వర్సిటీలో ఇటువంటి కార్యక్రమాలు స్వేచ్ఛగా జరుపుకొంటున్నారు. గీతంకు ఒక న్యాయం, ఏయూకు ఒక న్యాయమా. ఓ పత్రికలో రాసినంత మాత్రాన ఇలా అనుమతులను అర్ధంతరంగా రద్దు చేయడం సరికాదు. విద్యార్థులు, తల్లిదండ్రుల పరిస్థితులను అర్థం చేసుకోవాలి.

– సిహెచ్.ధనరాజ్, విద్యార్థిని తండ్రి

నేడు పాలిసెట్

మురళీనగర్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్‌ను శనివారం నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామని పాలిసెట్ విశాఖ నగర సమన్వయాధికారి డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. నగరంలో 19, పెందుర్తి పరిసరాల్లో 3, భీమునిపట్నంలో 6 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. నగర పరిధిలోని 19 కేంద్రాల్లో 9,511 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారని చెప్పారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులను ఉదయం 10గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, 11గంటలు దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించేది లేదని చెప్పారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

నగరంలోని పరీక్ష కేంద్రాలను జిల్లా పరిశీలనాధికారి కె.విజయభాస్కర్ శుక్రవారం పరిశీలించారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలకుడు గండి గోవిందం నాయుడు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావుతో కలిసి పరిశీలించి, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పరిపాలన రాజధానితో విశాఖ అగ్రపథం


పార్టీలో చేరిన యువతతో బొత్స ఝాన్సీ, కోలా గురువులు, జియ్యాని శ్రీధర్, ఏఎస్ఆర్ తదితరులు

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే అది సాధ్యం
- ఆ పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ వెల్లడి
- ఆమె సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి యువత, ముస్లిం నాయకులు

ఎంవీపీకాలనీ: పరిపాలన రాజధానిగా కార్యరూపం దాల్చడం ద్వారానే విశాఖ అగ్రపథంలో నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ పేర్కొన్నారు. లాసన్స్ బే కాలనీలోని ఆమె క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నగరానికి చెందిన యువత, ముస్లిం నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. గాజువాకకు చెందిన ఏఎస్ఆర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువతకు ఆమె పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వీరితో పాటు చినవాల్తేర్ మసీదుకు చెందిన ముస్లిం నాయకులను కూడా ఆమె పార్టీలోకి ఆహ్వానించారు. ముస్తాఫా, జాన్ సహిబ్ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు ఝాన్సీకి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ తన గెలుపు ద్వారా విశాఖ అభివృద్ధిని కాంక్షిస్తూ యువత, ముస్లిం తనకు మద్దతు ప్రకటించడంపై ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువుదీరడం ద్వారానే విశాఖ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో విజయం అనంతరం ఇక్కడి నుంచి ప్రమాణ స్వీకారం చేస్తానని సీఎం వైఎస్ జగన్ ప్రకటించడం విశాఖ అభివృద్ధిపై ఆయన దార్శనికతకు నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువుదీరడం ద్వారా విశాఖ నలుదిశలా వ్యాప్తి చెందుతుందన్నారు. టీడీపీ, ఇతర పార్టీలు అధికారంలోకి వస్తే విశాఖ అభివృద్ధి ఆగిపోతుందనే విషయాన్ని యువత ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్, మక్కాకు దర్శనానికి అన్ని విమానయాన సంస్థల సర్వీసులు వంటి అంశాల్లో పార్టీతో పాటు ఆమె చేసిన సేవలను వారికి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

బస్సు ఢీకొని మహిళ దుర్మరణం


తల్లి మృతదేహం పక్కన రోదిస్తున్న కుమార్తె అనూష

అగనంపూడి : ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్తను చూసుకుని ఇంటికి వెళ్లేందుకు వడ్లపూడి కూడలి వద్ద రోడ్డు దాటుతున్న గృహిణిని ఫార్మాసిటీకి ఉద్యోగులను తీసుకెళ్లే బస్సు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పరవాడ మండలం చింతల గొర్లెవానిపాలెంకు చెందిన పైలా వెంకటరమణ తాపీ పనులు చేసుకుంటూ తన భార్య వరలక్ష్మి, కుమార్తె అనూషతో కలిసి జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 24న గ్రామ దేవత పండగ సందర్భంగా మందుగుండు సామగ్రి కాల్చే క్రమంలో చేతిలో టపాకాయ పేలిపోయింది. దీంతో వడ్లపూడిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం వెంకటరమణ చేరారు. రెండు రోజుల నుంచి చికిత్స పొందుతున్నారు.

ఆస్పత్రిలో భర్త వద్దనే ఉన్న వరలక్ష్మి శుక్రవారం ఉదయం ఆరున్నర గంటలకు నడిచి వెళ్తూ జాతీయ రహదారి వడ్లపూడి కూడలి జీబ్రా క్రాసింగ్ వద్ద రోడ్డు దాటుతుండగా, ఆమెను ఫార్మా కంపెనీకి చెందిన బస్ ఢీకొంది. వరలక్ష్మి పక్కనే ఉన్న కుమార్తె అనూష బిగ్గరగా కేకలు వేస్తున్నా డ్రైవర్ పట్టించుకోకుండా కింద పడిపోయిన వరలక్ష్మి తలపై నుంచి బస్సును పోనివ్వడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కళ్ల ముందే తల్లి దుర్మరణం చెందడంతో తల్లడిల్లిన అనూష రోదన చూపరులను కలచివేసింది. మృతిరాలి కుమార్తె అనూష ఎంబీబీఎస్ చదువుతోంది. బస్సు డ్రైవర్ బొరయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి షర్మిల ప్రచారం

సాక్షి, విశాఖపట్నం : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఉత్తరాంధ్రలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో, సాయంత్రం 4 గంటలకు అల్లూరి జిల్లా పాడేరులో, 7 గంటలకు అరకులో బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. అరకులోనే రాత్రి బస చేయనున్నారు. 28న ఉదయం అరకు నుంచి బయల్దేరి విశాఖ చేరుకొని ఉత్తర నియోజకవర్గంలో ప్రచార సభలో పాల్గొని సాయంత్రం శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, పలాసలో బహిరంగ సభల్లో షర్మిల ప్రసంగించనున్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులకు అభినందనలు


కారులో అపస్మారక స్థితిలో సత్యప్రసాద్

మద్దిపాలెం : కారునడుపుతూ అపస్మారక స్థితికి చేరుకున్న వ్యక్తిని సకాలంలో స్పందించి కాపాడిన కంచరపాలెం పోలీసులను నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ శుక్రవారం అభినందించారు. గురువారం అర్ధరాత్రి మురళీనగర్ వర్మ కాంప్లెక్స్ వద్ద ఓ వ్యక్తి కారులో వెళ్తూ మధ్యలో కారు ఆపేసి అస్వస్థతకు గురికావడం అటుగా వెళ్తున్న కొందరు గమనించి 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. తక్షణం స్పందించిన కంట్రోల్ రూం సిబ్బంది కంచరపాలెం పోలీసులను అప్రమత్తం చేశారు. కంచరపాలెం ఎస్‌ఐ రవికుమార్, నైట్ బీట్ కానిస్టేబుల్ అప్పలనాయుడు, సంతోష్ తక్షణం ఘటనా స్థలానికి చేరుకున్నారు. డ్రైవింగ్ సీటులో ఉన్న వ్యక్తిని లేపడానికి ప్రయత్నించారు. అయితే అతను ఎంతకీ లేవకపోవడంతో కారు అద్దం పగులగొట్టి, అతనికి ప్రాథమిక చికిత్స అందించి దగ్గరలో ఉన్న ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం అతని బంధువులకు సమాచారం అందించారు. సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్‌ఐ, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు.